క్లుప్తంగా

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆవిర్భావం

నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(ఏపీఎంఈఎఫ్) ఆవిర్భావించింది. ఆదివారం నగరంలోని మున్సిపల్ ట్రావెలర్ బంగ్లాలో ఆవిర్భావ సభ జరిగింది. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య, ఇంజినీరింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఈ ఫెడరేషన్ పనిచేస్తుందని నాయకులు చెప్పారు. ప్రస్తుతం తాత్కాలిక అడహక్ కమిటీని ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ సి.తిరుపాల్, గౌరవ సలహాదారుగా సోమి శంకర్ రావు, ప్రెసిడెంట్‌గా ఈదులమూడి మధుబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సోమి ఉదయ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్లుగా ఎం.అజయ్ బాబు, పి.అబ్రహాంలింకన్, సెక్రటరీగా బందెల రవికుమార్, జాయింట్ సెక్రటరీగా సాకే వెంకట నరసయ్య, కార్యవర్గ సభ్యులుగా జి.జయరాములు, వి.సురేష్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

ఘనంగా గంగానమ్మ తల్లి కొలుపులు



నెహ్రూనగర్: నగరంలోని 2వ వార్డు అరుంధతినగర్‌లోని గంగానమ్మ తల్లి కొలుపులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా హాజరై, పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో కొలుపులు నిర్వాహకులు వెంకట్రామిరెడ్డి, సుబ్బిరామిరెడ్డి, ముసలయ్యరెడ్డి, 2వ వార్డు వైఎస్సార్‌సీపీ ప్రెసిడెంట్ శివనాగేశ్వరావు, పల్లా శ్రీను, సాంబిరెడ్డి పాల్గొన్నారు.

అలరించిన నృత్యప్రదర్శనలు



నగరంపాలెం: స్థానిక జేకేసీ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం పొట్లూరి ధార్మి(అమెరికా, న్యూజెర్సీ) భరత నాట్యం ఆరంగేట్రం చేశారు. ఆధ్యాత్మ స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ శిక్షకురాలు కావ్య శేఖరన్ నేతృత్వంలో నృత్యాలు ప్రదర్శించారు. కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్ మాట్లాడుతూ భారతీయ సాంస్కృతిక జీవనంలో భరతనాట్యం దేశ, విదేశాల్లో కీర్తిగడించిందని అన్నారు. ఎన్నారై పొట్లూరి ధార్మి నృత్యప్రదర్శనలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం ధార్మికి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో ధార్మి కుటుంబ సభ్యులు చైతన్య, జయప్రకాష్, ప్రిన్సిపాల్ పరుచూరి గోపీచంద్, నిర్వాహకురాలు సిహెచ్.సుశీల పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

నగరంపాలెం: స్థానిక గుజ్జనగుండ్ల ట్రాక్ ఆవరణలో ఆదివారం స్నేహితుల దినోత్సవం జరుపుకున్నారు. కుల, మత, వర్గాల అతీతంగా స్నేహితులు కలిశారు. కార్యక్రమంలో కొరిటెపాడు టీఎస్ఆర్ విజయశ్రీ మ్యాచింగ్ సెంటర్ అధినేత సాంబశివరావు, స్నేహితులైన బి.అశోక్‌రెడ్డి, ఐవీకే ప్రసాద్, మల్లేశ్వరరెడ్డి, భార్గవ్, శ్రీనివాస్‌రావు, మల్లికార్జున, రాంబాబు పాల్గొన్నారు.

ఎస్ఐఎస్ఎస్ కార్యాలయంలో..

ప్రతి అడుగులోనూ ప్రోత్సహిస్తూ, ఆనందం, బాధలో వెంటనడిచే వారే స్నేహితులని విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ అన్నారు. బృందావన్ గార్డెన్స్ ఎస్ఐఎస్ఎస్ కార్యాలయ ఆవరణలో ఆదివారం స్నేహితుల దినోత్సవం జరుపుకున్నారు. తొలుత కాళహస్తి సత్యనారాయణ, మార్కెటింగ్ జేడీ రాజశేఖర్ కేక్ కట్ చేశారు.

17 నుంచి శ్రీవారాహి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



తెనాలి: కొల్లిపర మండల గ్రామం కుంచవరంలోని పోస్ట్ చారిటబుల్ ట్రస్ట్ క్యాంపస్–2లో శ్రీవారాహి దేవి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఈనెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా కార్యక్రమ ఆహ్వాన పత్రికను ఆదివారం స్థానిక గంగానమ్మపేటలోని ది తెనాలి కమిషన్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) ఆవిష్కరించారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు. కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు, ఎస్వీ యోగ కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, సొసైటీ డైరెక్టర్ డీఎల్ చక్రధర చౌదరి, దేవస్థానం కమిటీ చైర్మన్ తన్నీరు శ్రీనివాస బాబు, టి.నాగమల్లీశ్వరిదేవి, దేవతి భాస్కర రావు, హరిదాసు గౌరీశంకర్, గ్యాలం వేణు, శిల్పాల శ్రీనివాసు, గోపు రామకృష్ణ, మారుతీ ప్రసాద్, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాలకు నోటీసులిచ్చి కూల్చివేత

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో అనధికార నిర్మాణాలకు నోటీసులు ఇచ్చి కూల్చి వేయాలని, నిర్దేశిత భవన నిర్మాణ ప్లాన్ లేకుండా, నిబంధనలు పాటించకుండా జరుగుతున్న నిర్మాణాలను ఉపేక్షించబోమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఆదివారం అరండల్ పేట, గుంటూరువారి తోట ప్రాంతాల్లో అనధికార కట్టడాలు, బ్రాడీపేట, పట్టాభిపురం మెయిన్ రోడ్, జేకేసీ కాలేజి రోడ్ ప్రాంతాల్లో రోడ్, డ్రెయిన్ ఆక్రమణలపై తీసుకోవాల్సిన చర్యలపై పట్టణ ప్రణాళికాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో జీఎంసీ నుంచి నిర్దేశిత భవన నిర్మాణ ప్లాన్ తీసుకోకుండా, ప్లాన్‌కి భిన్నంగా నిర్మాణాలు చేస్తే పట్టణ ప్రణాళిక అధికారులు సదరు నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చి, చట్ట ప్రకారం కూల్చి వేయాలన్నారు. అరండల్ పేట, గుంటూరువారి తోట ప్రాంతాల్లో అనధికార కట్టడాలను గమనించి పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ ప్లాన్ మంజూరుకు అనేక నిబంధనలను సరళతరం చేసినా ప్లాన్ తీసుకోవడంలో నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. సచివాలయం పరిధిలో అనధికార, అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే పర్యవేక్షణ చేయాల్సిన సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు, అధికారులు ఏమి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శంకర్ విలాస్ వంతెన పనులు దృష్ట్యా ఈ నెల 9 నుంచి ప్రస్తుతం ఉన్న వంతెన కూల్చివేత పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ట్రాఫిక్ ప్రత్యామ్నాయంగా ఉన్న రోడ్లు, డ్రెయిన్ల ఆక్రమణల తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించామని వివరించారు. ఆక్రమణల తొలగింపు వాహనాలు రాత్రి సమయాల్లో కూడా వార్డుల వారీగా మెయిన్ రోడ్లపై పర్యటించి, ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పర్యటనలో ఏసీపీ రెహ్మాన్ పాల్గొన్నారు.



పట్టణ ప్రణాళిక అధికారులకు సూచిస్తున్న కమిషనర్

మిషన్ గ్రీన్ గుంటూరులో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం కీలకం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ చేపట్టిన మిషన్ గ్రీన్ గుంటూరులో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం కీలకమని, వారి సూచనలు, సలహాలతో పర్యావరణహిత గుంటూరు కోసం కృషి చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో మిషన్ గ్రీన్ గుంటూరుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పర్యావరణ హిత గుంటూరే లక్ష్యంగా గుంటూరు నగరపాలక సంస్థ మిషన్ గ్రీన్ గుంటూరు కార్యక్రమం చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా ఈ సీజన్‌లో దశలవారీగా 5 లక్షల మొక్కలను నాటడం ద్వారా పచ్చదనం పెంపు, పారిశుధ్య పనులలో మెరుగుదల, వ్యర్థాలను తడిపొడిగా వేరు చేసి తీసుకోవడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయం నిషేధ్యం, నగరంలోకి వచ్చే ప్రధాన మార్గాలు, జంక్షన్లు, ఐలాండ్స్, పార్కులు, డివైడర్లపై పచ్చదనం పెంపు వంటి చర్యలు పకడ్బందీగా తీసుకోనున్నట్లు చెప్పారు. మిషన్ గ్రీన్ గుంటూరుని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా స్వచ్ఛంద సంస్థలు ప్రధానంగా హోం, క్లస్టర్ కంపోస్ట్ తయారీ, మొక్కల పెంపకం, ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లకు ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులను అందించే అంశాల్లో సహకరించాలని కోరారు. సమావేశంలో గ్లోబల్ ఎన్విరాన్మెంట్ ఎకాలజీ ప్రొటెక్షన్ సర్వీస్ వ్యవస్థాపక అధ్యక్షులు చెలికాని సీతారామయ్య, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్, సెక్రెటరి కె.సతీష్, ఐటీసీ ఫినిష్ మేనేజర్ నారాయణ, పర్యావరణ విద్య నోడల్ అధికారి తిరుపతిరెడ్డి, జీఎంసీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

క్యాంపస్ ప్రొటెక్షన్ యాక్ట్ జీఓ విడుదలపై హర్షం

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్‌లోని వేలాది ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు చిరకాలంగా ఎదురుచూస్తున్న సమస్యలపై పాఠశాల విద్యాశాఖ కమిషనర్ క్యాంపస్ ప్రొటెక్షన్ యాక్ట్ జీఓ విడుదల చేయడంపై ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్(అపుస్మా(రాష్ట్ర అధ్యక్షుడు కొలసాని తులసి విష్ణు ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం నగరంపాలెంలోని ప్రజ్ఞ స్కూల్‌లో ప్రభుత్వ జీఓ కాపీలు ప్రదర్శించారు. విష్ణు ప్రసాద్ మాట్లాడుతూ గతంలో విద్యార్థిని, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, పాఠశాల యాజమాన్యాలకు అకారణంగా బయట వ్యక్తుల నుంచి, కొంతమంది తల్లిదండ్రుల నుండి అనేక ఒత్తిళ్ల దౌర్జన్యాలు ఎదుర్కోవటం పరిపాటిగా ఉందని చెప్పారు. కొత్తగా వచ్చిన జీఓ ప్రకారం ప్రైవేట్ పాఠశాలల ప్రాంగణాలలో ఎటువంటి రాజకీయ గుర్తులు, రాజకీయ పార్టీలకు సంబంధించిన వస్తువులు, జెండాలు, కరపత్రాలు ప్రదర్శన నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. సమావేశంలో అపుస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.మస్తాన్ రావు, అదనపు కోశాధికారి కాటూరి వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు నాయుడు చక్ర నాగ్, నగర అధ్యక్షుడు కన్నా మాస్టర్, జిల్లా కోశాధికారి ఎస్ సాంబిరెడ్డి పాల్గొన్నారు.



జీఓ కాపీలు ప్రదర్శిస్తున్న పాఠశాలల యాజమాన్య సంఘ నాయకులు

విశ్వ గురువు అవార్డు స్వీకరించడం అభినందనీయం

నగరంపాలెం: ప్రొటెస్టెంట్ బైబిల్ 1500, క్యాథలిక్ బైబిల్ 1900 పేజీల గ్రంథాలను చేతి రాతతో రాసి గ్రంథస్తం చేసిన జీడీవీ ప్రసన్నతబాబు అభినందనీయమని ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ రివైవల్ ఫోరం నాయకులు ఏజీఎం గణేష్‌పాల్ అన్నారు. కోవిడ్–19 వేళల్లో రెండేళ్లకు పైగా శ్రమించి రెండు బైబిళ్లను చేతి రాతతో రాసిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో విశ్వ గురువుగా అవార్డు అందుకున్న సందర్భంగా ఆదివారం ప్రసన్నతబాబు, కమల దంపతులను కన్నావారితోట ఉల్ఫ్ స్టూడెంట్ చాపల్ ప్రార్థన మందిరంలో సత్కరించారు. క్రీస్తు సేవలో ప్రసన్నతబాబు ఉన్నారని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో రివైవల్ ఫోరం అధ్యక్షులు డాక్టర్ ఎంజేవీ గురునాథం, చీఫ్ సలహాదారు డాక్టర్ టీజే రాజేంద్ర ప్రసాద్, చర్చి గురువులు వడ్లమూడి ఆదాం, క్రిస్టఫర్, సంఘ పెద్దలు కూరాకుల డేవిడ్ నిరీక్షణరావు, రాజశిఖామణి, కుమార్, దయారత్నరాజు, డాక్టర్ వైవీఎస్ రవి, జాన్‌శ్యామేల్, కన్నయ్య, రఘు కుమార్ పాల్గొన్నారు.



ప్రసన్నతబాబుకు సన్మానం

సమాజాభివృద్ధికి నిరంతరం పరితపించే పలకలూరి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం పద్మావతి కల్యాణ మండపం వేదికపై ఏపీ ప్రభుత్వ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీత పలకలూరి శివరావు(గుంటూరు) రచించిన ఎడారి ఓడ వజ్రోత్సవ జ్ఞాపిక పుస్తక పరిచయ సాహిత్య సభ ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథి ప్రముఖ కవి గంటా మనోహర్‌రెడ్డి (హైదరాబాద్) మాట్లాడుతూ పలకలూరి శివరావు సేవలు అభినందనీయమని చెప్పారు. డాక్టర్ రావి రంగారావు, విమల సాహితీ అధ్యక్షుడు డాక్టర్ జెల్డి విద్యాధర్, రచయితలు ఎ.శ్రీనివాసరావు, సయ్యద్ జానీబాషా, సంఘ సేవకులు బత్తుల మురళి, రచయిత్రి తాటికోకిల పద్మావతి, తుళ్లూరు సూరిబాబు, బలరాం, కవులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు. అనంతరం పలకలూరి శివరావును సత్కరించారు.



శివరావుని సత్కరిస్తున్న అతిథులు, కవులు

సెలవు రోజుల్లో తరగతుల నిర్వహణపై ఆందోళన

గుంటూరు ఎడ్యుకేషన్: చంద్రమౌళీనగర్‌లోని భాష్యం జూనియర్ కళాశాల ఎదుట అఖిల భారతయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) గుంటూరు నగర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి గురువెల్లి సాయి మాట్లాడుతూ సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న భాష్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పుస్తకాలు, యూనిఫాం పేరుతో వేలకు, వేలు ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. అగ్నిమాపక, పార్కింగ్ వ్యవస్థ, కనీస మౌలిక సదుపాయాలు లేకుండా అద్దె భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్న కళాశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

10న రాత పుస్తకాలు పంపిణీ



తెనాలి: వేదిక బ్రాహ్మణ సేవా సమాఖ్య, తెనాలి ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన పేద బ్రాహ్మణ విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేయనున్నట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణమూర్తి వెల్లడించారు. 10న మధ్యాహ్నం 3 గంటలకు నాజరుపేట అనుగోల వారి వీధిలోని విద్యాశంకర భారతి నృసింహసదన భవనంలో కార్యక్రమం జరుగనున్నట్లు తెలిపారు. సంబంధిత కరపత్రాన్ని ఆదివారం సమాఖ్య కార్యాలయంలో ఆవిష్కరించారు. పట్టణ, పరిసర గ్రామాల్లోని ఒకటి నుంచి పీజీ వరకు చదివే పేద బ్రాహ్మణ కుటుంబాలకు చెందిన విద్యార్థులు ప్రతి ఒక్కరికీ ఉచితంగా నోట్ బుక్స్ అందజేస్తామని తెలిపారు. మండల తహశీల్దార్ కె.వి గోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరవుతారని, భవన నిర్మాణానికి సహకరిస్తున్న కాశీనాదుని సుబ్రహ్మణ్యశాస్త్రిని అదే వేదికపై సత్కరిస్తామని వివరించారు. విద్యార్థులు ఈనెల 8వ తేదీలోగా నోట్ బుక్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. గౌరవాధ్యక్షుడు భాగవతల కామేశ్వరరావు, కోశాధికారి తిరుమలరావు, ఉపాధ్యక్షుడు కుందేటి వెంకట సుబ్రహ్మణ్యం, ఎం.శ్రీనివాసమూర్తి, సంయుక్త కార్యదర్శి టి.ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు కుందేటి ఉదయ నరసింహమూర్తి, అబ్బరాజు ఉదయ శంకర్, వలివేటి హర్ష వెంకట్, గౌరవ సలహాదారు పొడుగుపాటు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పీవీ రమణకు సువర్ణ కంకణ ధారణ, గద్దర్ అవార్డు ప్రదానం

నగరంపాలెం: పాతికేళ్లుగా పాటే ప్రాణంగా జీవన గమనాన్ని సాగిస్తున్న ప్రజావాగ్గేయకారుడు పీవీ రమణ తెలుగు సాంస్కృతికోద్యమ జయకేతనమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. సంస్కృతి(సంగీత, సాహిత్య, నృత్య, నాటక సంస్థ), అమరావతి ఉద్యమ సమితి జేపీసీ సంయుక్తంగా బ్రాడీపేట కొరటాల సమావేశ మందిరంలో ఆదివారం ప్రజా గాయకుడు రమణకు సువర్ణ కంకణ ధారణ, గద్దర్ అవార్డు ప్రదానం చేశారు. అనంతరం రమణ దంపతులను సత్కరించారు. సభకు అమరావతి పరిరక్షణ సమితి అధ్యక్షులు పీవీ మల్లికార్జునరావు అధ్యక్షత వహించారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ప్రముఖ కవి జయరాజ్ మాట్లాడుతూ ఉద్యమాలకు ఊపిరిలూదేది ప్రజా కళాకారులేనన్నారు. ప్రజల హృదయాలను గానంతో తట్టి లేపిన ప్రజా గాయకుడు అని ప్రశంసించారు. కార్యక్రమంలో సర్రాజు బాల చందర్, డాక్టర్ పోలే ముత్యం, బాలస్వామి, ఎం.విప్లవ కుమార్, నూతలపాటి కాళిదాసు, కవులు, కళాకారులు పాల్గొనగా, గాయకులు ఆలపించిన చైతన్య గీతాలు అలరించాయి.



రమణకు అవార్డు ప్రదానం చేస్తున్న దృశ్యం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన విజయవంతం చేయండి

జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు

గుంటూరు మెడికల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారిగా పీవీఎన్ మాధవ్ మంగళవారం జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు కోరారు. ఆదివారం స్థానిక అరండల్ పేట లోని యోగిభవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఐదో తేదీ ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లాలో జరిగే వివిధ కార్యక్రమాలలో పాల్గొంటారన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు చిల్లీస్ రెస్టారెంట్ వద్ద నుంచి శ్రీ కన్వెన్షన్ వరకు శోభాయాత్ర జరుగుతుందని తెలిపారు. అనంతరం శ్రీ కన్వెన్షన్ లో పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి తమనంపూడి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో రాష్ట్ర అర్బక జేపీసీ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు బజరంగ్ రామకృష్ణ, తోట శ్రీనివాసరావు, కార్యదర్శి నారాయణరెడ్డి సీనియర్ నాయకులు వైవీ సుబ్బారావు, కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

గుంటూరు ఎడ్యుకేషన్: దేశంలో ప్రమాదాల బారిన పడుతున్న కోట్లాది మందిని ఆదుకోవడంలో రక్తం ప్రధాన భూమిక పోషిస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జాతీయ సేవా పథకం అధికారి మద్దినేని సుధాకర్ పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని అపెక్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ ఆధ్వర్యంలో డీ ఎస్ఆర్ ఫ్రెండ్స్, రెయిన్ బో బ్లడ్ బ్యాంక్ సహకారంతో స్నేహితుల దినోత్సవం పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించారు. వందమందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ సరిపడినంత రక్తం అందక అనేకమంది మృత్యువాత పడుతున్నారని, రక్త దానం ప్రాధాన్యాన్ని విద్యార్థులు, యువత గ్రహించాలని సూచించారు. అపెక్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ వ్యవస్థాపకుడు కొత్తపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ 30 ఏళ్లుగా విలువలతో కూడిన జీవన విధానం, సమాజ సేవ యొక్క ప్రాధాన్యం విద్యార్థులకు నేర్పుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్ఆర్ ఫ్రెండ్స్ దామచర్ల శ్రీనివాసరావు, డాక్టర్ నీలిమ ప్రియదర్శిని, రెయిన్బో బ్లడ్‌బ్యాంక్ నవీన్ చక్రవర్తి, విజేత కాంపిటీషన్స్ వాసుదేవరావు పాల్గొన్నారు.



రక్తదాన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న మద్దినేని సుధాకర్

అశోక్‌బాబుకు పలువురి పరామర్శ

రేపల్లె: తూటికాడను తొలగించి రైతులకు మేలు చేయాలని కోరుతూ ఇరిగేషన్ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త అశోక్‌బాబు చేపట్టిన దీక్షను అడ్డుకునే నెపంతో పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి దాడి చేయటాన్ని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం చేరి చికిత్సను నిరాకరిస్తూ దీక్ష కొనసాగిస్తున్న అశోక్‌బాబును ఆదివారం పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మాజీ మంత్రి, గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అంబటి రాంబాబు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్, బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, జనరల్ సెక్రటరీ అంజని ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మేకతోటి దయాసాగర్‌లతో పాటు పలువురు రైతులు, రైతు సంఘాల నాయకులు ఆయనను పరామర్శించి సంఘీభావం తెలిపి మద్దతు ప్రకటించారు.



అశోక్‌బాబును పరామర్శిస్తున్న గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

ప్రత్యేక అవసరాల బాలలకు వైద్య శిబిరం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రత్యేక అవసరాల బాలలకు సాంత్వన చేకూర్చడంలో ఉపకరణాలు ఉపయోగపడతాయని హైదరాబాద్‌కు చెందిన అలిమ్ కో ఆర్థో టిస్ట్ చిరంజీవి బెహరా అన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని శారదా నికేతన్ పాఠశాలలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఉచిత పరికరాల వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా చిరంజీవి బెహరా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో దివ్యాంగులైన చదువు నేర్చుకుంటున్న బాల బాలికలకు అవసరమైన వారికి ఉపకరణాలు అందజేసి సమాజంలో వారి అభివృద్ధికి చేయూతనిస్తుందని అన్నారు. ఇంక్లూసింగ్ ఎడ్యుకేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్య శిబిరంలో 256 మంది బాల, బాలికలు నమోదు చేసుకున్నారని తెలిపారు. శిబిరంలో ఉపాధ్యాయులు జీవీ శ్రీధర్, భారతి, ఎలమంద, సాంబశివరావు, హేమలత పాల్గొన్నారు.



బాలలకు వైద్య పరీక్షలు నిర్వహణ

అ'పూర్వ' సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

నెహ్రూనగర్: నగరంలోని శ్రీ జలగం రామారావు మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్‌లో 1980- 81 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు 45 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. ఫ్రెండ్స్ ఫర్ ఎవర్ పేరుతో గ్రూపుగా ఏర్పడి తమతో పాటు చదువుకున్న వారిని ఏకం చేసి 150 మందితో నగరంలోని ఓ హోటల్‌లో స్నేహితుల దినోత్సవం ఆదివారం సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు హాజరై మాట్లాడారు. అనంతరం పాఠశాలల్లో అత్యుత్తమ మార్కులతో రాణిస్తున్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తెనాలి టౌన్: రూరల్ మండలం కొలకలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1976–77 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పాఠశాలలోని తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి సమావేశాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని.. 47 ఏళ్ల నాటి పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి ఆత్మీయ కలయిక నిర్వహించడం సంతోషంగా ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. సహా విద్యార్థులలో అసువులు బాసిన కొందరు స్నేహితులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఆనాటి గురువులైన జి.కోటేశ్వరరావు, ఉమాదేవి, సుబ్బారావులను ఘనంగా సత్కరించారు. ఈ పూర్వ సమ్మేళనానికి కృషి చేసిన సీహెచ్ భాస్కరరావు కన్వీనర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పి.నటరాజు, జి.రవీంద్రబాబు, ఎస్.శ్రీనివాసరావు, జి.శ్రీనివాసమూర్తి, వెంకటరమణ, నరసింహారావు, డాక్టర్ తాడిబోయిన సాంబశివరావు, వనజ, పద్మశ్రీ, ఉషారాణి, ఉమాకుమారి, వెంకటరమణమ్మ, ఉదయలక్ష్మి ఉన్నారు.



కొలకలూరులో పూర్వ విద్యార్థులు సమావేశం

వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాలలో..

తెనాలి: స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాలలో 1979–82లో బీకాం చదివిన విద్యార్థులు 43 ఏళ్ల తర్వాత ఆదివారం మళ్లీ అదే కాలేజీలో కలుసుకున్నారు. విద్యాభ్యాసం తర్వాత రకరకాల వృత్తులు, వ్యాపారాల్లో స్థిరపడినవారు.. ఉద్యోగ జీవితం నుంచి రిటైర్ అయినవారు ఆ సమావేశంలో పాల్గొని తమ నేస్తాలను ఆత్మీయంగా పలకరించుకున్నారు. పలువురు తమలోని కళాసృజనను ప్రదర్శించి, అభినందనలు అందుకున్నారు. అప్పటి గురువులు నన్నపనేని ముకుందరావు, కోడూరి మల్లికార్జునరావు, అల్లం సత్యనారాయణ, జానకి రామయ్య, అమిరినేని శివప్రసాద్‌లను ఆహ్వానించి పూర్వ విద్యార్థులంతా ఘనంగా సత్కరించారు. వచ్చే ఏడాది కళాశాలలో జరిగే వజ్రోత్సవ వేడుకల్లో మీరంతా పాల్గొనాలని కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ కోరారు.

హోప్ విన్ హాస్పిటల్‌లో ఉచితంగా హెచ్‌పీవీపీవీ వ్యాక్సిన్

గుంటూరు మెడికల్: కొన్ని రకాల క్యాన్సర్ల నివారణకు హెచ్‌పీవీ(హ్యూమన్ పాపిలోమా వైరస్)వ్యాక్సిన్ దోహదపడుతుందని హోప్‌విన్ హాస్పిటల్స్ చైర్‌పర్సన్, ఇన్ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ షమ సుల్తానా అన్నారు. ఆదివారం స్థానిక గుంటూరువారితోట ఏడోలైన్‌లోని హోప్ విన్ హాస్పిటల్స్‌లో చైర్‌పర్సన్ డాక్టర్ షమా సుల్తానా, ఫౌండర్ డాక్టర్ నజీరుద్దీన్ ఆధ్వర్యంలో 20 సంవత్సరాల లోపు వయసున్న 70 మంది యువతులకు లక్ష విలువ చేసే వ్యాక్సిన్ రెండో డోసు ఉచితంగా వేశారు. డాక్టర్ షమా సుల్తానా మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ కొన్ని రకాల ఇన్ఫెక్షన్‌ను నివారించడమే కాకుండా గర్భాశయ క్యాన్సర్, జననేంద్రియ మొటిమలు రాకుండా నిరోధిస్తుందన్నారు. గొంతు క్యాన్సర్ల నుంచి రక్షించడంలో ఈ వ్యాక్సిన్ ఎంతో సహాయపడుతుందని పేర్కొన్నారు.



వ్యాక్సిన్ వేయించుకున్న వారితో డాక్టర్ షమ సుల్తానా

స్వచ్ఛత అభియాన్ పక్షోత్సవాలు

తెనాలి రూరల్: స్వచ్ఛత అభియాన్ పక్షోత్సవ కార్యక్రమాన్ని స్థానిక రైల్వే స్టేషన్లో ఆదివారం నిర్వహించారు. భారతీయ రైల్వేలో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్వచ్ఛత అభియాన్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో 'స్వచ్ఛత పరిశుభ్రత' గురించి ప్రయాణికులకు ప్రముఖ వైద్యులు డాక్టర్ డి.శారద అవగాహన కల్పించారు. అనారోగ్యం సంభవించినప్పుడు బాధపడడం కంటే అది రాకుండా చూసుకోవడం ముఖ్యమని.. ముందు జాగ్రత్త చర్యలతో ఎన్నో రోగాలను అరికట్టవచ్చునని ఆమె తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ రమణ, చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ సృజన, హెల్త్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, పీడబ్ల్యూఐ, రైల్వే ఏఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.